# పదం తప్పింది

పసుపతికి సుదీర్ఘ జీవితం; ఐతే అందువల్ల ఆయనకు జీవితం మీద విరక్తి కలగాలా? చాలాసార్లు ఆయన చపలమనస్సుడైపోతూకూడా మరల మనస్సును స్వాధీనపర్తుకుంటూ ఉండేవాడు. కారుణ్యం, దయ, ఆప్యాయతలను విసర్జిస్తూ కొన్ని సమయాల్లో అతను ఒక మునివంటి జీవితం కొనసాగించినప్పటికీ, జీవితం మీద ఆశని కోల్పోవలసిన అగత్యం లేదు. ఇప్పుడు అతని వయస్సు 76. నిర్లిప్తతతో ఆయన జీవితాన్ని ఇంకా కొంచెం తేలిగ్గా తీసుకోవచ్చుకదా అని ఎవరికైనా అనిపించవచ్చు. పవిత్ర కాశీకి వెళ్ళాలనేది అతని గాఢమైన కోరిక. దీనికి కారణం విరక్తికాదు; అదొక తీవ్ర వాంచ!

గతంలో ఒకసారి అతను కాశీ వెళ్ళి పవిత్ర గంగాస్నానం చేసి ఉన్నందుకు ఆయన ఎంతగానో తృప్తి పడ్డారు. ఐతే ఆ పట్టణం, దాని ప్రాశస్త్యం ఆయన ఇప్పుడు పూర్తిగా మరిచిపోయారు.. సముద్రతీరాన అవసరమైనవారికి మార్గదర్శకంగా కనిపించే దీపస్తంభంలాగ తన కుటుంబంతో కలిసి ఉండాలన్నదే ప్రస్తుతం అతని లక్ష్యం. ఆ విధంగా అతను తనువు చాలించేవరకు భౌతిక బాధ్యతలు నెరవేర్చాలన్నదే ఆయన కోరిక. ఇప్పుడు ఆయన మనవడు పశుపతీశ్వరన్ కాశీ విశ్వవిద్యాశాలలో రెండేళ్ళ చదువుకోసం వెళ్తడంవలన ఆయనకి కాశీ వెళ్ళాలనే వాంఛ మళ్ళీ మొలకెత్తింది.

ఆ అబ్బాయికి ఇదే మొదటిసారి వేలమైళ్ళదూరంలో ఉన్న ఒక మహానగరానికి చేసే ప్రయాణం. అంత దూరంలో ఉన్న కాలేజీగురంచి తనాలోచిస్తూ "ఏంరా, కాశీకి వెళ్ళాలనిపించే అంత వయసా నీకు?" అని పశుపతి మనవడిని ఆటపట్టించేవారు. ఆ అబ్బాయి తల్లికి ఎంతమాత్రం



ఇష్టంలేదు ఈ ప్రతిపాదన. "వాడెప్పుడూ ఉత్తరదేశానికి వెళ్ళి ఉండేలేదు," అని ఆవిడ అందరికీ చెప్తూండేది. ప్రతిష్టాత్కమైన కళాశాలలో మాస్టర్ డిగిరీకి చదవడానికే ఈ ప్రయాణం అన్న ఒకే విషయానికే ఈశ్వరన్ ఉబ్బి తబ్బి బ్బోయాడు. "తాతయ్యా, మీరు కూడా నాతో వస్తారా?" అని గేలించాడు.

"నువ్వు నన్ను అడుగుతున్నావా? అది మర్చిపో," అని నవ్వుతూ పశుపతి సమాధానమిచ్చారు. ఈ లోగా ఇతర కుటుంబ సభ్యులు ఈశ్వరన్ ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లలో తోడ్పడ్డారు. ఇంటి వాకిట్లో ఒక ఎద్దుబండి నిలబడి ఉంది.

"ఈశ్వరా, నువ్వు అక్కడ హాస్టల్లో ఉంటావు. ఏదో ఒకరోజు అకస్మాత్తుగా నేను ప్రత్యక్ష మవుతాను అనుకో. నేనుకూడా నీతో ఉండవచ్చనుకుంటాను, సరేనా? కొంచెం వాకబు చేసి కనుక్కో. నేను నాలుగు నెలలపాటు అక్కడ ఉండేందుకు జాగా దొరుకుతుందేమో చూడు. నేను వస్తాను. నాకు ఆ పవిత్ర స్థలానికి రావాలనిపిస్తోంది," అన్నారు పశుపతి మనవడితో.

'ఓ, తప్పకుండా తాతయ్యా, " అని మాట ఇచ్చాడు ఈశ్వరన్. "అమ్మా, నాన్నా కూడా నీతోబాటే రావాలని ఉంది నాకు."

"సెలవల్లో మాతో గడపడానికి రా అన్నయ్యా,?" అని అడిగింది ఈశ్వరన్ చెల్లెళ్ళలో ఒకామె ఆతృతతో.

"నువ్వు రాకపోతే తాతయ్యే మమ్మల్ని నీ దగ్గరకి తీసుకువస్తారు," అన్నది ఇంకొక చెల్లాయి. తాతయ్య సహకారం ఎప్పుడూ ఉంటుందన్న నమ్మకం ఆమెకు ఉన్నాకూడా ఇప్పుడు అన్నయ్యను అర్థిస్తున్నట్లు అతని చెయ్యి పట్టుకొని వేడుకుంది.

"ఇంకటేమో జరుగుతోంది, అన్నయ్య సరదాగా దేశప్రయాణం చేస్తున్నాడు," అని చిన్న తమ్ముళ్ళు వలయవస్తూ ఆనందంగా వలయాకారంగా గెంతులేస్తున్నారు.

ఎలాగైతేనేం, ఈశ్వరన్ అందరి చేతులు విడిపించుకొని ఎద్దుబండిమీద సామానులు సర్దుకొని కూర్చున్నాడు. రైలు స్టేషన్ లో వీడ్కోలు చెప్పడానికి ఆయన తండ్రి వెంటవెళ్ళారు.

"అన్నయ్య ఎప్పుడు కాశీ చేరుకుంటాడు? కాశీ ఎలా ఉంటుంది?" అని పిల్లల లక్ష ప్రశ్నలకి సమాధానం చెప్పారు తాతయ్య. అవన్నీ గుర్తుండే వయసు దాటిపోయింది ఆయనకి. "నేను వాటిగురించి ఎందుకు మాట్లాడుతున్నాను?" అని తనని తనే ప్రశ్నించుకున్నారు అతను. కాని ఆతృతతో వినేవాళ్ళుంతవరకూ ఆయన తన సహజ హాస్య ధోరణిలో ఓపికతో వాళ్ళకి సమాధానాలు చెప్పారు.

** ** **

ఇప్పటివరకు ఈశ్వరన్ కుటుంబ సభ్యులు అతనితో ఎడబాట్లు ఎరుగరు. అందువలనే చాలా దూరదేశానికి ఆయన వెళ్తున్నాడని వాళ్ళు కొంచెం ఆందోళన, అలసటతోబాటు పడుతున్నారు. ఇటీవల వార్తా పత్రికలలోని కొన్ని సంఘటనలు వారి ఆరాటానికి మరికొంత ఎగదోసాయి. ఉత్తరాదిన వర్షకాలంలో అక్కడి జనులు ఎదురుకొనే వరదలు ఇతి బాధలు సర్వసామాన్యం. ఇప్పుడు ఈశ్వరన్ ఉత్తరాదిలో ఉండడం వలన వార్తల్లో వచ్చే అక్కడి సంఘటనలపట్లా ఆ కుటుంబ సభ్యులు మరింత ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ సంవత్సరం వరదలు మునపటికన్నా తీవ్రస్థాయిలో ఉండడమే కాకుండా వాటివలన ఎక్కువ నష్టం వాటిల్లిందని చదివి, గాభరా పడిపోయి, "అక్కడ ప్రమాదభరితంగా ఉండడంవలన వెంటనే బయలుదేరి ఇంటికి వచ్చేయ్," అని ఈశ్వరన్ కి టెలిగ్రాం ఇచ్చారు.

ఈశ్వరన్ తన సొంత ధోరణిలో టెలిగ్రాం ద్వారా స్పందిచ్చాడు: "రోడు ప్రయాణికులకే పరిస్థితి ప్రమాదకరం. రైలు రాకపోకలు పాక్షికంగానే దెబ్బ తిన్నాయి. నేను ఇంటికి రావలసిన అవసరం లేదు. నా గురించి ఆందోళన



చెందడం మానుకోండి." ఏదైనా టెలిగ్రాం అని వస్తే చాలు - ఇంకా విడత విప్పకుండానే - వాళ్ళమ్మ భయపడిపోయింది. ఒక వేళ ఈశ్వరన్‌కి ఏదైనా అపాయం లేక ఇంకా భయంకరంగా ఆయన చనిపోయాడనే వార్త అయితే? ఆవిడ కంగారుకి ఇంకా బలం చేర్చేలాగ ఆ టెలిగ్రాం చేతిరాతలో ఒకటి రెండు పదాలు స్పష్టంగా లేకపోవడంచేత చదువుతున్న ఆయన తడబడ్తూ, ఆగుతూ చదివాడు.

ఈ గందరగోళమంతా కొద్ది క్షణాలే అయినా, అదే ఆ తల్లి భరించలేకపోయింది. ఈశ్వరన్ సరైన సందేశమే ఇచ్చాడు. కాని ఆయన పదాల్ని ఎవరో తప్పుగా మార్చేసారు.

ఎలాగైతేనేం, ఆ కుటుంబ సభ్యులు మెల్లగా మూడు నెలలు గడిపేసారు.

ఇంతలో దశరా శెలవులు వచ్చాయి. నిజానికి జరిగినవి కేవలం కొన్ని నెలలే ఐనా, ఆ కుటుంబ సభ్యులకి అదే ఎంతో కాలం జరిగిపోయిన భావన కలిగింది, "శెలవులికి నేనింటికి వస్తాను," అనడానికి ఈశ్వరన్ మొగమాటం పడ్డాడు. ఐనా అతని తల్లితండ్రులు తిరిగి జవాబు రాసారు:" అవును, అది బడలికితో కూడిన ప్రయాణమే. ఐనా నీకు రాగలుతే రావచ్చుగా?" అని. ఖర్చులు ఈశ్వరన్ అనుకున్న ప్రయాణాన్ని ఆపగలుగుతాయా? అందువలన ఒక ఉదయాన్న ఈశ్వరన్ ఇంటికి చేరుకున్నాడు. కుటుంబంలో సభ్యులందరికీ ఏదో ఒక బహుమతి తీసుకువచ్చాడు.

ఇంతకుముందెప్పుడూ కాశీ వెళ్ళి ఉండనట్టు పశుపతి ఆ నగరంగురించి ఏవేవో ప్రశ్నలు అడిగారు. ఒక చిరునవ్వుతో ఈశ్వరన్ సమాధానం చెప్పాడు: "తాతయ్యా, బెనారస్‌లో ప్రతి ఒక్కరూ చూడవలసిన స్థలం మా విశ్వవిద్యాలయం."

"అది నేను చూడలేదే? ఈ సారి నీతో తప్పకుండా వస్తాను." అని ధృడంగా పశుపతి అన్నారు. కొంచెం ఆగి, "చూడు ఈశ్వరా, మీ అమ్మా నాన్నలు నీ గురించి బెంగపెట్టుకున్నారు. అస్తమానం నీ గురించే మాట్లాడుతుంటారు - నువ్వేం తింటున్నావో, ఏం చేస్తున్నావో, అని. మరి నీ గురించి నేనెందుకు బాధపడనో నీకు తెలుసుకోవాలని ఉందా? నీకు తెలుసుకదా నేను బెనారస్ వెళ్దామనుకుంటున్నాని? అందుకనే నీ గురించి నేనేమీ బాధపడను. అంతేకాదు, సంవత్సరాలు తరబడి నాకు కావలసిన వాళ్ళకు దూరంగా ఉండే అలవాటుంది నాకు. ఇంటిగురించి, కుటుంబంగురించి ఆలోచనలు లేకుండా ఇక కాశీలో నాలుగు నెలలు గడపాలని నా ఆశ," అన్నారు పశుపతి. ఇప్పుడు ఆయన తలపంతా బెనారస్ మీదనే

"తాతయ్యా, మీరు ఇంటిదగ్గర ఉన్నారు కాబట్టి బెనారస్ గురించే ఆలోచిస్తున్నారు. కాని మీరొకసారి బెనారస్ గాని చేరుకుంటే అప్పుడు మళ్ళీ ఈ ఇంటినిగురించి, చిరపరిచితమైన ఈ పరిసరాలను గురించే ఆలోచిస్తారు," అన్నాడు ఈశ్వరన్ నవ్వకుండానే. అతను స్వానుభవంతోనే చెప్తున్నాడు ఈ మాటలు. ఇంటినుంచి దూరం వెళ్ళిపోయిన తరువాతనే ఈశ్వరన్ స్వగ్రామంలో ఉన్నప్పుడి ఆనంద ఘడియలు, తాను తనకి నచ్చిన స్తలాలలోనే, తోటల వెంబడి పెరటి నూతిగట్టున ఉన్న చెట్లూ, చేమలూ, నడవలో ఉన్న ఉయ్యాల మొదలైనవన్నీ గుర్తు చేసుకొని ఆనందించేవాడు.

"అది నిజమే బాబు." అన్నాడు తాతయ్య. అక్కడితో ఆ సంభాషణ ముగిసింది. తన కొడుకుతో మాట్లాడాలని వంటింటిలో ఉన్న తన కోడలు - అదే ఈశ్వరన్ తల్లి - ఎదురుచూస్తున్న సంగతి ఆయనకి ఎరుకే. ఆ అబ్బాయి తండ్రి తీరే వేరు, తానేమిటి, తన వృత్తేమిటి తప్ప తనకు



సంబంధంలేని విషయం పట్టించుకోనట్లు కనిపిస్తాడు. అబ్బాయి రాగానే యధాలాపంగా వేసే కుశలప్రశ్నలతో తృప్తి చెందాడు. కాని ఆ తల్లి సంగతి అలా కాదు.

ఆ పదిహేను రోజుల శెలవులు ఈశ్వరన్ బాగా ఆస్వాదించాడు. తనకిష్టమైన కలకండ మళ్ళీ మళ్ళీ తింటున్నట్టు, శెలవలతరువాత కళాశాలకి తిరిగివెళ్ళే ఏర్పాటులు చేసుకుంటూంటే పసుపతి మళ్ళీ మనవడితో హాస్యాలాడారు;

"ఏరా బాబు, కనీసం మాట వరుసకైనా కాశీకి రమ్మని నన్ను ఆహ్వానించలేదేమిరా?? నువ్వే ఒకసారి ఆ కుతూహలం నాలో రెచ్చగొట్టేవ్ కాబట్టి నా మనసంతా దానిమీదే ఉంది."

"మొట్టమొదటిసారికూడా మీరలాగే మనసుపడ్డారుకదా??" అని ఈశ్వరన్ తాతయ్యకి గుర్తు చేసాడు. "ఇప్పుడు నేనే హాస్యానికి అన్నట్టుగా అడిగితే ఏం ప్రయోజనం? మీరు ఇంతకుముందే అన్నట్లు నాతోబాటు హాస్టల్‌లో ఎలా ఉండగలరు?"

"ఊళ్ళో ఏదైనా బస ఏర్పాటు చూడమని చెప్పలేదా నేను? ఏదైనా లాడ్జి లో లేక ధర్మసత్రంలోనైనా పరవాలేదు. ముసలాణ్ణి నేను, హాస్టల్‌లో ఎలా ఉండగలను చెప్పు?"

"ఓ, తప్పకుండాను తాతయ్యా! ఈసారి ఎలాగైనా ఏర్పాటు చేసేస్తాను; మీరు మాత్రం తప్పక రావాలి. ఇప్పుడు ఊరు నాకు కొంచెం తెలియవచ్చిందికాబట్టి నేను ఇప్పుడు తప్పక చూడగలనే నమ్మకం కలిగింది."

"అంత మాటలన్నావే, అదే పదివేలు నాకు. తొందరేంలేదులే; తీరుబాటుగానే చూడు; అందుకోసంకాని ఎక్కువ శ్రమ పడ్డవద్దు నాయనా?" అన్నారు పశుపతి, తృప్తిగా. ఈశ్వరన్ తాతయ్యని కృతజ్ఞతతో చూసాడు.

తనిచ్చిన మాటను తు.చ. తప్పకుండా అమలుచెయ్యమని ఈ గొప్ప వ్యక్తి వత్తిడి చెయ్యలేదు. ఒక చిన్న భరోసా ఇచ్చిన మాటే చాలు. పాపం పశుపతి! మరి ఆయన ఇతర కొడుకులూ, అప్యాయమైన కోడళ్ళూ, మనవలూ ఎందుకని అతనిమీద మొరబెట్టుకుంటున్నారు? ఈ ఇంటిలో అందరూ అతన్ని అక్షరాలా ఆరాధిస్తున్నారే? బహూశా ఈశ్వరన్ తండ్రి ఆయన సంతానంలో ఆఖరివాడైనందువల్లనేమో?

కుటుంబ సభ్యుల దగ్గర శెలవు తీసుకొని ఈశ్వరన్ కాశీకి బయలుదేరాడు. మునపటిలాగ భయం, ఆందోళన, ఉత్సుకతలు లేకుండా పూర్తి సంతోషంతో కనిపించాడు. శెలవులు బహుకొద్ది రోజులే ఐనా, అదే ఒక విధంగా మెరుగే అయింది; తన వాళ్ళని విడిచిపెట్టినందుకు బాధనిపించలేదు. బెనారస్‌లో తన్నుకూడా స్వాగతం పలికే మిత్రులున్నారు; క్లాసులుంటాయి; వాళ్ళ వాళ్ళ పాఠంశాలను చెప్పించుకోడానికి సహాధ్యాయి అమ్మాయిలుంటారు.

"ఈ అమ్మాయిలూ చదువులో చురుకైనవారే!" అని ఈశ్వరన్ తనలో తనే అనుకున్నాడు. "వాళ్ళు ఒకింత ఓపికతో కలుపుగోలుతనం తగ్గించుకుంటే బాగున్ను!"

ఈ అమ్మాయిలే రేపు తనకుమించిన పెద్ద చదువులు చదువుకుని పెద్ద పెద్ద పదవుళ్ళో ఉండే భర్తల్ని ఆశించినప్పుడు తప్పక ఓర్మి, చనువు తగ్గించుకుంటారు. ఐతే వాళ్ళగురించి ఇంకా లోతుగా అధ్యయనం చెయ్యడానికి ఈశ్వరన్ కి అంత తీరుబాటు లేదు.

ఒక సంగతి మాత్రం యదార్థం. ఇప్పుడు అమ్మాయిలపట్ల కొంత శ్రద్ధ వహిస్తున్నమాట నిజం; భవిష్యత్తులో తనకు కాబోయే భార్యగురించి మరీను. ఆమె ఇప్పుడు ఎక్కడ ఉందో? ఆమె పేరేమిటో? ఆమె భరతనాట్యం



ఇష్టంగా అభ్యసిస్తుందో లేక నీడపట్ట ఆటలు ఆడ్తుందో? ఇప్పుడు కంటికి కనిపించకపోయినా అలాంటి యువతి ఎక్కడో ఉండితీరాలి!

ఇప్పుడు ఈశ్వరన్ ఆలోచనలు ఇంటివద్ద ఉన్న చెళ్ళెళ్ళమీదకి వెళ్ళాయి. గత మూడు నెలలో, ఆ ముగ్గిరిలో పెద్దది ఈడేరింది.

రాబోయే నాలుగేళ్ళలో తన జీవితం ఎలా వెళ్ళబోతుందో అనే ఆలోచన పట్టుకుంది. తన చదువు పూర్తి ఐతేనే ఉద్యోగం; అదెక్కడ తన్నుతీసుకువెళ్తుందో? అప్పుడు తను తన చెల్లెలికి సరైన పెళ్ళికొడుకుని వెతుకుతాడు. అంత ముఖ్య పాత్ర పోషింపబోతానే ఆలోచన ఈశ్వరన్ని తబ్బిబ్బచేసింది.

అబ్బా! ఇంకా నాలుగేళ్ళు!బహూశ తాతగారు మరో రెండేళ్ళలోతన చెల్లెల పెళ్ళి చేసేయాలని పట్టుపడతారేమో?

వయసొచ్చిన అందమైన ఆడపిల్లలకు అవి తరిగిపోక ముందే పెళ్ళిళ్ళు చేసెయ్యాలని తాతయ్య అభిప్రాయం. "ఆడపిల్ల అందచందం స్కూలులోనే ఎందుకు అంకితం ఐపోవాలి?"అని అడుగుతారు. "అంద చందాలతో కూడిన ఆడ పిల్లను పెళ్ళిచేసుకొని ఆ భర్త ఆనందించవద్దా? జీవితంలో ప్రతీదీ ఏ వయస్సులో జరగవలసిన కార్యక్రమం ఆ వయస్సులోనే జరగాలి."

తన భావాలే సరైనవి, ఆచరించదగ్గవి అని తాతయ్య నొక్కి వక్కాణిస్తారు. ఆయన భావాన్ని బలపరిచే కొన్ని ఉదాహరణలుకూడా చెప్తారు. ఆ పరిసరాల్లో ఉండే ఒక అమ్మాయినిగురించి ప్రస్తావిస్తూ, "ఆమెను నాలుగు సంవత్సరాలముందు చూసినది గుర్తుందా?" అని అడుగుతారు. "ఈ రోజు ఆమె పెళ్ళిలో చూసినవారికి వికృతంగా కనిపిస్తోంది!" ఇప్పుడు తన చిన్న చెల్లెలు పెళ్ళి ఎప్పుడు జరిపినా ఈశ్వరన్‌కి అభ్యంతరం లేదు. తాతయ్య చెప్పేది నిజమే అని తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు. అతను ఎప్పుడూ తప్పు చెడు సలహా ఇవ్వరు!

తన ప్రయాణంలో ఈశ్వరన్ మనస్సు అనేక విషయాలపై వెళ్ళింది; తాతయ్య, ఆ తరువాత తన చిన్న చెల్లి పెళ్ళి విషయం, ఇలా. అయినా కాలేజి చేరుకున్నాక ఈశ్వరన్ చదువుల్లో మునిగిపోయాడు. రోజులు తొందరగా దొర్లిపోయాయి.

** ** **

ఇంటినుంచి ఈశ్వరన్‌కి తరుచుగా ఉత్తరాలు వస్తూండేవి; ఒకటి రెండు తాతయ్య రాసినవికూడా ఉంటుండేవి. కాని ఒకసారికూడా తనకి మకాం సమకూర్చేడా అన్న విషయ ప్రస్తానం ఉండేది కాదు. తాతయ్యకి ఈశ్వరన్ దగ్గరకి రావాలనే కోరిక ఉందనికానీ, బెనారస్‌లో తాతయ్య విడిదికి ఏమైన ఏర్పాటులు జరుగుతున్నాయా అనిగాని ఇంటినుండి ఏ ఒక్కరూ ఎప్పుడూ వాళ్ళ ఉత్తరాల్లో ప్రస్తావించలేదు. "నాతో వస్తారా తాతయ్యా?" అను తను అడిగినప్పుడు తాతయ్య హాస్యమాడారా? అని ఈశ్వరన్ ఆశ్చర్యపోయాడు.

ఒక రోజున స్నానఘట్టంలో ఈశ్వరన్ ఒక బంధువుని చూడడం తటస్తించింది. ఆ నాడు సూర్యగ్రహణం అయి ఉండడంవలన, తన జన్మ నక్షత్రం ప్రకారం ఆ రోజు తాను శాస్త్రోక్తంగా స్నానం చెయ్యవలసి ఊంటుందని పసుపతి ఈశ్వరన్‌కి రాసారు. ఆ బంధువు తాను మర్నాడే మద్రాసుకి వెళ్ళిపొతున్నానని చెప్పగానే "నేనుకూడా ఇప్పుడే వెళ్ళిపోతే ఎంత బాగుండేది!" అనే ఆలోచనని ఈశ్వరన్ అణుచుకోబోయాడు. ఎగురుకుంటూ ఇంటికి వెళ్ళిపోవాలనే వాంఛ ఉవ్విళ్ళూరింది. ఒక ఆలోచన మెరిసింది: అదే రోజునగాని తానింటికి బయలుదేరితే రెండు రోజుల్లో ఇంటిలో వాల్తాడు. ఆ మరుసటి ఉదయాన్నే ఇంటి భోజనం తినగల్గుతాడు. ఎంత చక్కగా ఆనందించవచ్చు! . . . అలా కొంత సేపు ఊహ ఆనంద డొలికలో ఊగిసలాడినతరువాత మనసు సర్ధుకొని తెలికపడింది. బహుశ తాతయ్యకూడా ఇప్పుడు తనలాగే బెనారస్ యాత్రగురించి



ఆలోచిస్తుంటాడేమో అని ఈశ్వరన్‌కి అనిపించింది. ఈశ్వరన్ చదువుమీద శ్రద్ధ పెట్టాడు. పరిక్షలు రాసి, ఎండాకాలం శెలవులకి ఇంటికి చేరుకున్నాడు.

కనురెప్పకూడా వెయ్యకుండా పశుపతి పూర్తి విశ్వాసంతో అడిగారు:

"ఈశ్వరా, నాకువిడిది ఏర్పాటు చేసేవుకదా, ఈ సారి నీతోకూడా నేను రావచ్చా?"

"లేదు తాతయ్యా! నాతో కలిసి బెనారస్ రావాలని మీకు నిజంగానే కోరిక ఉందా?"

"ఏమిట్రా అలాగ అడుగుతున్నావ్? నువ్వేం హాస్యమాడుతున్నావా, లేక నిజంగానే అలా అంటున్నావో చెప్పు."

మనసు పనిచేసేది ఇలాగే. అది ఎడతెగకుండా నిగూఢమైన విరుద్ధాలతో పెనుగులాడుతుంది. ఆ వేదనలో ఉధ్బవించే భావాలు బాహటంగానో, లేక చాటుగానో కనిపిస్తాయి; కొన్ని లోతుగా పాతుకుపోతాయి.

తాతయ్యలో కనిపించిన ప్రతిస్పందనకి ఈశ్వరన్ కంపించిపోయాడు. ఆ ముడుచుకున్న మొహం, ఆందోళన, నిరాశ, అపనమ్మకంతో స్పష్టంగా కానవస్తున్న తీరు తాను క్షమించతగని పాపం చేసిన భావంతో అతని హృదయం కుంగించిపోయింది.

ఈశ్వరన్ వాళ్ళ అమ్మతో, "తాతయ్య చాలా తీవ్రంగా నిరాశపొందినట్లు కనిపిస్తోంది," అన్నాడు. "ఎవరైనా ఒకరు నాకు ఈ సంగతి రాసి ఉండ వలసింది."

"ఏమిటో, ఇదెలాగో మా దృష్టిలో పడలేదే, " అంది వాళ్ళ అమ్మ. "నీ చదువు మరొక ఏడాది ఉందికదా అనే సంతోషంతో మరింక నిన్ను ఈ విషయంలో వత్తిడి చెయ్యకూడాదనుకున్నాం. నీ నాన్న ఈ విషయాలు అసలు పట్టించుకోరు; మీ తాతయ్యకూడా ఆయన ఆలోఛన ఏమిటో మాతో పంచుకోరు. పాపం, ముసలాయన. నిజంగానే కొత్త వాతావరణంలో నాలుగు

నెలలు గడపాలని ఉందేమో? పాపం! ఈ సారి నువ్వు కాలేజికి తిరిగివెళ్ళిన వెంటనే ఆయన విడిదిచెయ్యడానికి ఏర్పాటు చెయ్యి. మేం కూడా అతని కాశీ యాత్రకి తగిన ఏర్పాట్లు చేస్తాం. ఆయన వెంట వాంజీని తోడుగా పంపాలనుకుంటున్నాం. వాంజీ ఐతేనే తాతయ్యకి భోజన సదుపాయాలు చేస్తారు; అతన్ని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉంటారు. తాతగారు కాశీ యాత్రకి నిజంగానే తహతహలాడుతారనిపిస్తోంది; కాని మాతో ప్రస్తావించడానికి మొగమాటు పడ్తున్నారు. ఈ విషయం నేను ఇప్పుడే గ్రహించాను."

వాళ్ళమ్మ వెళ్ళబుచ్చిన యదార్థం ఈశ్వరన్ని విశ్మయ పరచింది. ఆ విశ్మయానికి బలం చేకూర్చారు వాంజీ.

"మీ తాతగారు సర్వ వేళలా కాశీ యాత్రగురించే ఆలోచిస్తూంటారు," అన్నారు వాంజీ. "ఒకటి రెండుసార్లు నువ్వు అతన్ని ఆహ్వానిస్తూ ఉత్తరం రాసావని ఉత్తుత్తినే నాతో హాస్యమాడతారు."

సరే, యదార్థమేమిటి? పశుపతి తన అంతరంగాన్ని వాంజీతోనే పంచుకొనేవారు. ఇతర మాటలకొచ్చేసరికి తన కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉన్నప్పుటికీ కాశీయాత్ర విషయంలో మాత్రం వాళ్ళతో ప్రస్తావన చెయ్యడానికి మనసొచ్చేదికాదు. "పురాణ చరిత్ర కలిగి ఉండడమూ, పుణ్యస్థలం కావడమూ అన్న మాటే తప్ప, బెనారస్‌కు గల ప్రాముఖ్యం ఏమిటి?" అని తనలో తనే అతను సమాధానం పడేవాడు. "అయినా నేనప్పుడే ఒక్కసారి వెళ్ళివచ్చానుకదా?" అని వాంజీతో హాస్యానికి అన్నట్టు అనేవాడు. ఒకసారి పశుపతి "నా మనవడు నన్ను ఆహ్వానిస్తున్నాడు, నా వెంట రావడానికి నువ్వు సిద్ధమేనా?" అని వాంజీని అడగ్గానే, అతను "అయ్యో రామ, ఇంతకన్నా దుదృష్టకరమైన సమయం వేరొకటి ఉంటుందా? ఈ నెలలోనే మా ఆవిడ పురిటికి వెళ్తుంది," అన్నారు.



"సరేలే, మర్చిపో. నువ్వెప్పుడూ బెనారస్ వెళ్ళలేవు!" అని అన్నారు పశుపతి నవ్వుకుంటూ.

పశుపతికి తోడునీడుగా ఉంటూ, కాస్త వార్చిపెడుతూ ఉండొచ్చుకాబట్టి పశుపతికి తోడుగా కాశీకి వెళ్ళాలనే గాఢమైన కోరిక వాంజీ మనసులో ఉండేది; అది బలే మంచి చౌక బేరం కూడాను; తన జేబునుంచి ఏ ఖర్చూ లేకుండా కాశీయాత్ర చేసేయొచ్చుకూడా. తను కేవలం చిన్న గుమాస్తావే, అయినా ఉద్యోగ రీత్యా, ఎవరికైనా తోడునీడుగా వెళ్తూండడమో లేక వారి పనులు వారి తరపున చేసిపెట్టడానికో వాంజీ సర్వసిద్ధంగా ఉండేవారు.

** ** **

ఈ సారి పూర్తిగా ఈశ్వరన్ ఎండాకాల శెలవులు ఇంటిదగ్గరే గడపాలని నిశ్చయించుకున్నాడు. తన చిన్ననాటి జీవితాన్ని మళ్ళీ అనుభవించాలని పూనుకున్నాడు. తనే స్వయంగా ఎడ్లబండు తోలుకుని వెళ్ళి తోటలో సువాసనతో ఉన్న తాటిముంజులు ఒక చోట నీడపట్టున కూర్చొని తిన్నాడు; లేత కొబ్బరి నీళ్ళు తాగాడు. ఎత్తైన మామిడిచెట్టులెక్కి వెదలి బుట్టల్లో మామిడికాయలు నింపాడు. జీవితంలో ఇటువంటి చిన్న చిన్న అనుభవాలు మళ్ళీ మళ్ళీ అనుభవించాడు. తను ఈ అనుభనువాలు మళ్ళీ ఎప్పుడు పొందగలడని ఎవరికి తెలుసు? శెలవులంతా ఇంటిలోనే గడపాలి అని నిర్ణయించుకున్నాడు.

కాని మనం అనుకున్నవన్నీ జరగవు కదా? తానొకటి తలుస్తే దేవుడు మరొకటి తలుస్తాడు.

పశుపతికి అకస్మాత్తుగా సుస్తీ చేసింది. "మరి నాకు వయసు మళ్ళిపోతోందికదా, ఎవరికెరుక? ఆ పైవాడినుండి పిలుపు వస్తోంది కాబోలు," అని అంటూ పశుపతి మనవడ్తో ఛలోక్తిగా అంటూండేవాడు. తన శరీరంలోని శక్తి అంతా వట్టిపోయిన భావంతో ఈస్వరన్ కలత చెందేవాడు:

ఎంత త్వరగా ఈ శెలవులు పోతాయి, ఎంత తొందరగా తాను మళ్ళీ బెనారస్ కి తిరిగివెళ్ళిపోయి తాతయ్యకి అనుకూలమైన విడిది ఏర్పాటు చేద్దామా అని ఈశ్వరన్ నిస్సహాయంగా యోచిస్తుండేవాడు. రోజులు దొర్లిపోవాలని ఆరాటం పడేవాడు. అందుకనే ఇప్పుడు స్నేహితుల ఆహ్వానాన్ని అందుకొని ఇతర పట్టణాల్లకీ, ఊళ్ళకీ వేళ్తుండేవాడు. ఈ క్రమంలో కొన్ని కుటీర పరిశ్రమల్ని చూడడం తటస్థించి తనలో ఏదో చెప్పుకోగల మార్పు రావడానికి దోహదపడింది.ఈ కొత్త అనుభవాల్ని ఆరాధిస్తూ చివరికి ఈశ్వరన్ బెనారస్‌కి తిరుగు ప్రయాణంకి సిద్ధమయ్యాడు.

"తాతయ్యా, ఇప్పుడు నాతో మీరు రాకూడదా? మనం అక్కడికి చేరుకోగానే తప్పకుండా మీకు జాగా ఏర్పాటు చేస్తాను. ఇంకెందుకు ఆలశ్యం?" తాతయ్య ఇప్పుడే తనవెంట వచ్చేయమని ఈశ్వరన్ ఆహ్వానించాడు.

"ఎందుకో అది నాకు నచ్చలేదురా, నాయనా." అన్నారు పశుపతి. "ఈ వయస్సులో అలా చెయ్యడం నాకిష్టం ఉండదు. నువ్వే ముందుగా ఏర్పాటు చేసి నాకు తెలియజేయొచ్చుకదా? వాంజీని నాతో రమ్మంటాను. బెనారస్ లో రెండు నెలలుంటే చాలు నాకు. బెనారస్ లో ఆఖరి ఊపిరి వదలాలనుకొనేవాళ్ళలాంటి వాడిని కాను నేను; ఆఖరు క్షణాలు ఈ కావేరీ తీరంలోనే గడవాలి. ఇప్పుడు నీతోబాటు రాలేకపోతున్నానని విచారించవద్దు; నేను తప్పకుండా వస్తాను. విడిది ఏర్పాటు చేసి నాకు తెలియజేయ్. అప్పటికి నేను తయారుగా ఉంటాను," అని అంటూ పశుపతి ఆ విషయాన్ని సానుకూలంగా పరిష్కరించారు.

తాతయ్యగారు శారీరకంగా బలహీనంగా కానవస్తున్నారేతప్ప ఈశ్వరన్ పట్ల ప్రేమ, ఉత్సాహంలో ఏమాత్రం క్రమించిపోలేదు. తాతయ్య సలహాన్ని



ఈశ్వరన్ అక్షరాలా కృతజ్ఞతతో స్వీకరించి ఆయన ఆశీస్సులు ఆకాంక్షిస్తూ ఆయన ముందు సాష్టాంగపడ్డాడు.

బెనారస్ చేరుకున్నవెంటనే ఈశ్వరన్ వాంజీతో కలిసి తాతయ్య సుఖంగా రెండు మూడు నెలలు విడిది చెయ్యడానికి అనువైన వసతి గృహాన్ని వెదకనారంభించాడు. వెంటనే ఏదీ కుదరలేదు. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణం కూడా ఆ వెతుకుబాటు త్వరపరచడానికి అనుకూలంగా లేదు. కలకత్తాపక్క వెళ్ళే రైలు పట్టాలు ఇటీవలి విపరీత వర్షాలకు బాగా దెబ్బతినియుండడంవలన రాకపోకలకు చాలా ఇబ్బంది కలిగింది. ప్రయాణానికి రక్షణలేకుండాపోవటమేకాక తపాలా బాగా దెబ్బ తినడమో లేక చాలా ఆలశ్యమవటమో జరుగుతోంది. ఉత్తర భారతానికి కొత్తవాడైన వాంజీ తోడ్పాడుతో దూరభారమైన ప్రయాణం చెయ్యమని తాతయ్యకి సలహా ఇచ్చే సమయమా ఇది? ఒక వేళ రైలు పట్టాలు బాగుచేయబడినాకూడా ఈ వాతావరణ పరిస్థితుల్లో అకస్మాత్తుగా అనుచితమైన మార్పులు వాతావరణంలో కలుగవచ్చు. తాతయ్యను ఎలాగైనా బెనారస్‌కు తీసుకురావాలి అన్న కోరిక ఎంత నిరాశజనకమైనా ఈ పరిస్తుతుల్లో అటువంటి సాహసం చెయ్యడానికి ఈశ్వరన్ ఏ మాత్రం ఇష్టపడలేదు.

"మరి కొన్ని రోజులు ఆగి చూద్దాంలే," అని తనలో తనే అనుకున్నాడు. "ఇంత త్వరలో నా ఆహ్వానంకోసం తాతయ్య ఎదురుచూడరు; అసలు ఆ సంగతి నేను మరిచిపోయానేమో అని కూడా అతను భావిస్తుండవచ్చు!" ఇలా ఆలోచిస్తుండగా ఉన్నట్టుండి ఒక రోజు "తాతయ్యా, వచ్చేయండి!" అని ఆహ్వానం పంపి పశుపతిని ఆశ్చర్యచకితుణ్ణి చేస్తే ఎంత బాగుంటుంది అనే ఆలోచన ఈశ్వరన్ కి వచ్చింది.

మన ఈశ్వరన్ ఈ విధమైన ఆలోచనలతో తపతపలాడుతుండగా ఆ ఈశ్వరుని ప్రణాళికలు వేరే విధంగా ఉన్నాయి. తన మనవడి దగ్గరనుంచి

రాబోయే ఆహ్వానంకోసం ఆతృతగా ఎదురుచూస్తున్న పశుపతి మనవడు పశుపతీశ్వరన్ ఆలోచనల్ని అధిగమించాడు.

వాళ్ళ నాన్నగారిదగ్గరనుంచి ఈశ్వరన్‌కి ఒక టెలెగ్రాం వచ్చింది: "వాంజీ వస్తున్నారు తాతగారితో. రైలు స్టేషన్ లో కలుసుకో!"

త్వరితంగా సంభవిస్తున్న ఘటనలతో ఈశ్వరన్ కొంచెం నిరుత్సాహపడ్డాడు. ప్రస్తుతం తాను చేపట్టిన చర్యలవలన వస్తున్న జోడీకోసం ఐదారు రోజులు పోతేగాని మకాం ఏర్పాటుకాదు. అంతగా కాకపోతే తాత్కాలికంగా ఏ సత్రంలోనో లేక మఠం లోనో వాళ్ళ ఉనికి ఏర్పాటు చెయ్యవచ్చు. "బహుశా తాతయ్యతో మరికొందరు యాత్రికులుకూడా ప్రయాణం చేస్తుంటారు.వారి ప్రోద్బలంతోనే ఈ ప్రయాణం తలపెట్టి ఉంటాడు. వాంజీ తనకు తోడునీడగా ఉన్నాడు; ఇక మనవడు బెనారస్ లో తన్ని ఆహ్వానించడానికి అక్కడ ఊడగా ఉన్నాడు. అతనికి ఇంకేం కావాలి?" అని ఈశ్వరన్ ఆలోచనలో పడ్డాడు.

తన గ్రామంనుంచి తాతయ్య ఇంత దూరంలో ఉన్న తన దగ్గరికి వస్తున్నాడన ఊహతో ఈశ్వరన్ ఊగిసలాడిపోతున్నాడు. పళ్ళూ, పాలు కొన్నాడు; ఈ వార్త తన స్నేహితులకి చెప్పాడు.

"నువ్వు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉన్నావే," అన్నాడొక మిత్రుడు. "నా తాతయ్యే నన్ను చూడడానికి వస్తున్నారన్న విషయం తెలిస్తే ఆ అదురుకు నేనేమయ్యావాడినో నాకు తెలియదు. వసపిట్టలాగ ఆయన ఉపదేశాలు చెప్తుంటాడు."

"నిజంగా ఏదో ఒక రోజు మా తాతయ్య వస్తే బాగుండుననిపిస్తుంది నాకు, " అన్నాడు మరొక మిత్రుడు. "ఇంటినుంచి ఎవరో ఒకరు వస్తున్నారన్న మాటతోనే నేను ఆహ్లాదపడిపోతాను."



"ఇంట్లో చేసిన పిండివంటలు ఏవైనా మీ తాతగారు తెస్తుంటారనుకుంటున్నావా? వాటిని అతను తినలేడనుకో; ఐనా నీ కోసం తీసుకురావచ్చుకదా?మాకు కూడా కొంచెం రుచి చూపిస్తావా?" అని అడిగాడు ఇంకో స్నేహితుడు.

ఆమిత్రుల్లో ఒకడు మరో మిత్రుడుతో అన్నాడు: "మీ తాతయ్య ఒక పెద్ద పెట్టిలో అరటి ఒరుగులు తీసుకువచ్చినట్టు నాకు గుర్తు," అని అంటూ అపనమ్మకంగా తలాడించాడు. "నిజం చెప్పాలంటే అవి నాకేం నచ్చలేదు."

ఈస్వరన్ కొంచెం జంకాడు: ఈ స్నేహితులందరూ తాతయ్యని చూస్తే ఏమవుతుందో? తాతయ్య తన్ను అమితంగా ప్రేమిస్తున్న విషయం తనకి తెలుసు. కాని ఆ ప్రేమ ప్రభావంవలనే అతను తన స్నేహితులలో లోపాలు గమనించి, "వీడు ఒక వాగుడుకాయ, "ఇతను మోసగాడు," "ఈ అబ్బాయి ఒక జిత్తులమారి', అంటూ ప్రారంభిస్తే ఏమవుతుందో? అదే ధోరణిలో తన స్నేహితులుకూడా తాతయ్యపట్ల గౌరవం చూపించకపోతే? అతన్ని "ఈ ముసలాడు," అని ఎగతాళి చేస్తారేమో?

"పెద్దవాళ్ళని తృప్తి పరచడం చాలా సులభం తెలుసా? వాళ్ళముందు ఒక సాష్టాంగం పడిపోయి గౌరవం చూపించావనుకో వాళ్ళు ఒకటే ఆశీస్సులతో నిన్ను ముంచేస్తారు. నువ్వు వాళ్ళతో ఎంత వాదించినా వాళ్ళు కోపం తెచ్చుకోరు," అన్నాదు ఈశ్వరన్. తన తాతయ్యగురించి తన స్నేహితులతో గొప్పగా చెప్పుకోడానికి ఈశ్వరన్ ప్రయత్నిస్తున్నాడు. పశుపతి నిత్యం తన బట్టలు తానే ఎలా ఉతుక్కుంటారనీ, ఒకప్పుడు ప్రతిష్ఠాకరమైన బిరుదలతోకూడిన ఒక గొప్ప పదవిలో ఉండేవారని వాళ్ళకి గుర్తుచేసాడు. ఏమైనా వాంజీగురించే తన భయమంతా; అర్థంలేని పనులతో వాంజీ తన స్నేహితులముందు తనకు తలవంపులు తెస్తాడేమో అనే ఆతురత.

అంతలోనే  మళ్ళీ తనను తానే సంబాలించుకున్నాడు: వాంజీ తన బంధువు కాదుగదా?

ఆ మరుచటి ఉదయాన్నే, పడకమీదినుంచి లేస్తూనే ఈశ్వరన్‌కి విభూది గుర్తుకొచ్చింది.  తాతయ్య తనకొకసారి ఈ పవిత్ర భ స్మం ఇవ్వగా తను దాన్ని భద్రంగా దాచిపెట్టిన విషయం ఇప్పుడు గుర్తుకొచ్చింది; పంచె కట్టుకున్నాడు; నుదుట విభూది రేఖలు దిద్దుకున్నాడు. రైలు స్టేషన్ కి బయలు దేరాడు. మిత్రులు వేళాకోళం చేసారు: "ఏవయ్యా, మీ తాతయ్యని తైరకొట్టాలనుకుంటున్నావా?"

"నిజం చెప్పాలంటే ఇది నాకు ఒక ప్రత్యేకమైన అవకాశం," అని మిత్రులకి ఈశ్వరన్ నవ్వుతూ బదులుచెప్పాడు. తొందరనే స్టేషన్ చేరుకున్నాడు. రైలుపెట్టెలు ఒకదానివెంట ఒకటి పరుగులు తీస్తుండగా నవ్వుకుంటూ ప్లేట్ ఫారం  మీద నిలబడి గమనిఛాడు. బండి ఆగగానే రెండవ తరగతి పెట్టె వైపు - వయసు మళ్ళిన తాతయ్య అందులో ప్రయాణం చేస్తూండవచ్చనే అభిప్రాయంతో - పరుగు తీసాడు పశుపతి ఒకసారి యధాలాపంగా ఆ విషయం చెప్పినది ఇప్పుడు గుర్తుకొచ్చింది.

ఈశ్వరన్ ఇంకా వెదుకుతునే ఉన్నాడు. అంతేకాదు; తాతయ్య మూడవతరగతిలో ప్రయాణం చేస్తున్నాడనే భావంతో కొంచెం మనసు నొచ్చుకున్నాడు, అడుగులు వెనక్కి తీసాడు. "నువ్వేనా ఈశ్వరన్?" అని అడిగారు వాంజీ తనముందు నిలుచొని. "మంచిది, నువ్వు వచ్చావన్నమాట."

"మీరు ఇక్కడికి వచ్చి చేరేరా అంకుల్?" అని ఈశ్వరన్ అప్యాయంగా ఆయన చెయి పట్టుకొని పలకరించాడు.

"నాకొక సూట్ కేసూ, సంచి మాత్రం ఉన్నాయి: ఏం పెద్ద బరువంటూ ఏమీ లేదు. మనకి కూలీ అవసరం ఉండదనుకుంటాను," అన్నారు వాంజీ.



"దీన్ని మాత్రం కొంచెం జాగ్రత్తగా పట్టుకోవాలి," అని తన చేతిలో ఉన్న ఒక పెట్టెని ఈశ్వరన్ కి అందించారు.

వాళ్ళకోసం ఒక కూలీ ఎదురుచూస్తున్నాడు. సామాన్లు తీసుకోమని వాడికి చెప్పి ఈశ్వరన్ కుడి ఎడమలకు చూస్తూ ఏదో వెదుకుతునట్టు కనిపించాడు: "తాతయ్యగారేరీ?" అని అడిగాడు.

"తాతయ్యగారా? . . . ."

"అవును, తాతయ్యగారే; ఏం అతను రాలేదా? వసతికోసం ఏర్పాట్లు ముందుగా చేసి రమ్మని మిమ్మల్ని పంపారా?"

"ఈశ్వరా, నీకు టెలిగ్రాం అందిందా?"

"అందింది; లేకపోతే నేనేం జ్యోతిష్కుడనా మీరు వస్తున్నారని తెలుసుకోడానికి?" ఈశ్వరన్ తన చేతి సంచిలోనుంచి అది బయటకి తీసాడు.

టెలిగ్రాం చదవకుండానే వాంజీ బదులు చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడేకాని మాటలు పలకరించలేదు; గొంతెత్తడానికి విఫల ప్రయత్నం ఛెస్తున్నాడు. నీళ్ళు నిండిన కళ్ళతో టెలిగ్రాం చదివాడు.   అందులో ఒక ఒక ముఖ్య పదం తప్పింది.  ఆ టెలిగ్రాం వాంజీయే  స్వయంగా పంపాడు. కాని ఇక్కడ రాసినవారెవరో ఆ సమాచారం తిరిగి రాయడంలో పొరబాటు చేసారు. అది తన తప్పుకాదు, ఐనా వాంజీ కన్నీరు కారుస్తూనే ఉన్నారు.. "ఈశ్వరా, ఈ చిన్న పెట్టిలో మీ తాతగారి అస్తికలున్నాయి; వాటిని గంగా నదిలో నిమజ్జం  చెయ్యడానికి నేనిప్పుడు ఇక్కడికి వచ్చాను."

తన శరీరమంతా అకస్మాత్తుగా జలసమాధిలో పూడ్చిపెట్టినట్టు ఈశ్వరన్ కి అనిపించింది. వంగి, చేతిలో ఉన్న ఆ చిన్న పెట్టెవైపు మతిపోయినవాడిలా చూస్తూ నిలబడ్డాడు.

"మీ నాన్నగారు రాసిన ఉత్తరం నీకు అందనేలేదా?"

ఒక వెక్కుతోనే సమాధానం చెప్పాడు ఈశ్వరన్. వంగి, ఆ చిన్న పెట్టెని అందుకొని నడవడం ఆరంభించాడు.

ఇప్పుడు గగనానికీ నేలకూ వారధిగా మారిపోయిన తన తాతగారు రూపాన్ని ఒక క్షణం ఊహించుకుందామని అతనేం అనుకుంటున్నాడా? కాకపోతే ప్లేట్ ఫారంమీద గబగబమని నడుస్తూ కిందకీ మీదకీ ఎందుకలా ఆలోచిస్తున్నట్టు?

విచారింపవలసిన అగత్యం లేకుండా చివరికి ఒక దివ్యమైన ముగింపుకి చేరుకున్న తాతగార్ని గురించి ఇప్పుడు ఈశ్వరన్ని ఓదార్చేవారెవరు? తాతగారి అంత్యక్రియలు కావేరీ తీరాన్న జరుగుతాయి; ఇప్పుడు అతని అస్తికలు పవిత్ర గంగా నదిలో నిమజ్జమవడానికి సిద్ధంగా ఉన్నాయి. పశుపతి స్వయ సాయుజ్యం పొంది ఈ భూత బంధాలనుండి విముక్తుడవుతాడు.

కాలం చెప్తుంది, ఈశ్వరన్ శత్యాన్ని గుర్తిస్తాడు. ప్రస్తుతం విధి తనతో వికృతంగా ఆడుతోంది. ఒక ఇత్తడి కుండలో పవిత్రమైన గంగాజలం సీలుచేసి ఉన్నట్టే తాతగారి అస్తికలతో కూడిన ఒక కలశం తన చేతిలో ఉంది. ఐనాకూడా చివరి పరిశీలన వచ్చేసరికి విధికి ఓటమి తప్పదు. త్వరలోనే తన తాతగారి అస్తికలు నిత్యమైన ఆ పవిత్ర గంగా జలాల్లో మిళితమైపోయి, అతని ప్రేమాభిమానాలు విశ్వ వ్యాప్తం చెందుతాయి.

ఇంతలో వడి వడిగా వెళ్తూన్న ఈశ్వరన్‌తో శృతికల్పడానికి వాంజీ అతనివెంట పరుగులు తీసారు. "మనవడివి నువ్వు ఇక్కడిక్కడే ఉన్నావుకాబట్టి ఆయన అంతక్రియలు జరిపించడానికి నీవే సరైనవాడివి," అని నచ్చ చెప్పాలనుకొని అతను ఆరాటం చెందడానికి ఆస్కారం లేదనిపించింది.

*********